పోలీసుల అత్యుత్సాహం

- వాహనానికి లారీ అడ్డుపెట్టడంతో పడిపోయిన యువకుడు
- గాయాలు.. దవాఖానకు తరలింపు

దవాఖానలో చికిత్స పొందుతున్న సాభీర్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 29 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. బాధితుని కథనం ప్రకారం... స్థానిక గౌతమీనగర్‌కు చెందిన ఎండీ సాభీర్ స్థానిక రంగపేటలో ఎలక్ట్రిషియన్ పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరాడు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటువైపుగా వస్తున్న సాభీర్ వాహనాన్ని పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. అక్కడున్న పోలీసులు కనిపించకపోవడంతో కాస్త ముందుకెళ్లాడు. ఓ కానిస్టేబుల్ లారీని అడ్డుపెట్టి ఆపే ప్రయత్నం చేయగా అది మెడభాగంలో తగలడంతో బైక్ తో సహ కిందపడిపోయాడు. పోలీసులు సాభీర్‌ను లేపి తమాషా చేస్తున్నవా అంటూ.. తనపై దాడికి దిగినట్లు తెలిపాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ సురేశ్‌ను వివరణ కోరగా.. లారీ అడ్డు పెట్టలేదని, బండి ఆపకపోవడంతో చెయ్యి అడ్డు పెట్టగా కింద పడిపోయినట్లు తెలిపారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

దహెగాం,సెప్టెంబర్ 29: మండలంలో 2023-2024 ఆర్థిక సంత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఏపీవో కల్పన తెలిపారు. 30న ఒడ్డుగూడ, లగ్గాం, బోర్లకుంట, ఇట్యాల, గెర్రె, చిన్నరాస్పల్లి, కొంచవెల్లి, ఐనం, కల్వాడ గ్రామాలు, అక్టోబర్ 1న మొట్లగూడ, ఖర్జీ, చంద్రపల్లి, 3న భామ్మన్ నగర్, చౌక, పీపీరావు కాలనీ, 4న కమ్మర్ పల్లి, బీబ్రా, దిగడ, గిరివెల్లి, కోత్మీర్, పెసరు కుంట, హత్తిని, రాంపూర్, దహెగాం, పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు, గ్రామసభలు నిర్వహించి తనిఖీలు వివరాలు వెల్లడించనున్నారని పేర్కొన్నారు.

13న పద్మశాలీ సేవా సంఘం ఎన్నిక

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 29: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు సంఘం ఎన్నికల అధికారి షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి గాదాసు నారాయణ విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు సంఘంలో 3610 మంది ఓటర్లున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం ప్రతినిధులు సంపత్‌కుమార్, రాజయ్య, రవికుమార్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కాసిపేట, సెప్టెంబర్ 29 : కాసిపేట మండలంలోని కొండాపూర్ శివారులో 108 అంబులెన్స్‌లో మహిళకు ప్రసవం జరిగింది. తుడుంగూడ గ్రామానికి చెందిన చాకటి కళావతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసువెళ్తుండగా కొండాపూర్ గ్రామ శివారుకు రాగానే నొప్పులు తీవ్ర కావడంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే నార్మల్ డెలివరీ చేశారు. దీంతో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆ తర్వాత తల్లీబిడ్డలను తర్వాత చికిత్స నిమిత్తం కాసిపేట పీహెచ్‌సీకి తరలించారు. కాసిపేట 108 సిబ్బంది ఈఎంటీ డీ ఆత్మారావు, పైలట్ ఎండీ అసద్ పాషాకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

జైనూర్, సెప్టెంబర్ 29 : జైనూర్ మండలం గౌరీ గ్రామ పంచాయతీ పరిధిలోని లేండిగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ ఆత్రం పోచుబాయిని ఆదివారం అమె భర్త ఆత్రం ధర్మారావుకు అప్పగించినట్లు జైనూర్ ఎస్ఐ సాగర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని లేండిగూడ గ్రామంలో ఆత్రం ధర్మారావు భార్య పోచుబాయి ఈ నెల 16న పెద్ద కుతురును కోహినూర్ పాఠశాలకు పంపించేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పోచుబాయి భర్త ధర్మారావు గ్రామంతో బంధువుల ఇండ్లలో వెతికాడు. ఈ నెల 28న శనివారం జైనూర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉందని సమచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఆచూకీ కోసం వెతకగా ఉప్పల్‌లోని ఒక హాస్టల్‌లో పని చేస్తుందని ఆచూకీ కనుగొన్నారు. అక్కడికి వెళ్లి ఆమెను విచారించగా అనూమానంతో వేధిస్తున్నాడని, అతనికి దూరంగా వెళ్లి బతుకుదామని హైదరాబాద్ వెళ్లినట్లు ఆమె తెలిపింది. ఆదివారం పోచుబాయిని తీసుకొని వచ్చి భర్త ధర్మారావుకు అప్పగించినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఆర్ఎంపీలు

కన్నెపల్లి, సెప్టెంబర్ 29 : భీమిని మండలంలోని వీగామ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ గాండ్ల పోశన్న కుటుంబానికి నియోజకవర్గంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు ఆదివారం రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల రవి, బెల్లంపల్లి అధ్యక్షుడు సూరం రాజేశ్వర్‌రెడ్డి, భీమిని మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బ్రహ్మానందం, రవీందర్, కిరణ్, రాజేశం, చంద్రయ్య, సాంబయ్య, దశరథం, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

మట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తాండూరు,సెప్టెంబర్ 29: సమస్యలు పరిష్కరించడంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పూర్తిగా విఫలమయ్యాడని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ఆదివారం తాండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఆయన మాత్రం హైదరాబాద్‌లో ఉంటూ సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. గ్రామా ల్లో ప్రజలు రోగాలతో బాధపడుతున్నా ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్లోరినేషన్ లేక గ్రామాల్లో వాడల్లో దుర్వాసన వస్తున్నదని విషజ్వరాలు వచ్చి మంచాన పడుతున్నారని చెప్పారు. తాండూరు మండలంలో ఇప్పటి వరకు జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పట్టణాలకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదన్నారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధీర్‌గౌడ్, పాగిడి చిరంజీవి, చిలువేరు శేషగిరి, పుట్టకుమార్, సిద్ధం మల్లేశ్, ప్రదీప్, తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి

చెక్కు అందజేస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేశ్‌కుమార్

కోటపల్లి, సెప్టెంబర్ 28 : ప్రతి ఒక్కరూ విధిగా బీమా చేయించుకోవాలని కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేశ్ కుమార్ సూచించారు. కోటపల్లి మండల కేంద్రానికి మానిపెల్లి మధూకర్ ఇటీవల మరణించగా నామిని అయిన అతని భార్యకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి ద్వారా బీమా యెజన ద్వారా మంజూరైన రూ.2లక్షలు విలువ చేసే చెక్కును అందజేశారు. బ్యాంకుల ద్వారా అతి తక్కువ మొత్తానికి ఇన్సూరెన్స్ అందిస్తామని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంక్‌లో ఖాతా తీసుకొని జీవిత బీమా చేసుకోవాలని సూచించారు.

సోషల్ ఆడిట్ గ్రామసభ

సోషల్ ఆడిట్ గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

కోటపల్లి, సెప్టెంబర్ 29 : కోటపల్లి మండలంలోని రొయ్యలపల్లిలో 15వ విడుత ఉపాధి హామీ సామాజిక తనిఖీకి సంబంధించిన గ్రామసభను ఆదివారం నిర్వహించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఉపాధిహామీ పనులకు సంబందించిన సోషల్ ఆడిట్ నివేదికను మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి సమక్షంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బద్ధం బాలయ్య, ఈసీ నరేందర్, డీఆర్పీ జంగు, పంచాయతీ కార్యదర్శి బొల్లం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఆందోళన

ఆందోళన చేస్తున్న మాలమహానాడు సభ్యులు

దండేపల్లి, సెప్టెంబర్ 29 :దండేపల్లి మండల కేంద్రంలో మాలమహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఎస్సీ వర్గీకరణ చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టవిరుద్ధంగా ఉందని విమర్శించారు. తక్షణమే వర్గీకరణను ఆపేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

చిన్నరిని అప్పగిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 29: మందమర్రి పట్టణం శ్రీపతినగర్ ఏరియాకు చెందిన ఎండీ సజీదా-రియాజ్ దంపతుల ఐదేళ్ల చిన్నారి సన్ ఫిర్దోష్ ఆదివారం తప్పిపోయింది. ఉదయం 10 గంటల సమయంలో చిన్నారి ఇంటి వద్ద గల దుకాణం వద్దకు వెళ్లింది. ఎంత సేపటికీ ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆందోళన చెంది డయల్ 100కు ఫోన్ చేయడంతో ఎస్ఐ రాజశేఖర్ అప్రమత్తమై ఆరు పోలీసు బృందాలతో, సామాజిక మధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం దీపక్‌నగర్ కాలనీలో చిన్నారి ఆచూకీ తెలుసుకొని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఏఎస్ఐ మజీద్ ఖాన్, బ్లూటూత్ సిబ్బంది సురేందర్ లచ్చు పటేల్,ఉత్తం వెంకటేశ్, ఐడీ పార్టీ అజయ్, హోంగార్డ్ శ్రావణ్‌ను ఎస్ఐ అభినందించారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

- చెన్నూర్ కోర్టు జడ్జి పర్వతపు రవి

గురుకుల పాఠశాలలో సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రవి

జైపూర్, సెప్టెంబర్ 29: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెన్నూర్ కోర్టు జడ్జి పర్వతపు రవి పేర్కొన్నారు. ఆదివారం జైపూర్‌లోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లి గర్భం నుంచి మొదలు మనిషి చనిపోయేంతవరకు చట్టాలున్నాయని తెలిపారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే మన జీవితం సక్రమ మార్గంలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కమల్ మనోహర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ గిల్లా, న్యాయవాదులు శ్రీనివాస్, రవీందర్, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పై ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


జాతీయ రహదారిపై పార్కింగ్ చేసి ఉన్న భారీ వాహనాలు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 : బెల్లంపల్లి పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ వాహనాలు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వంద పడకల దవాఖాన నుంచి గాంధీనగర్, కన్నాల, డబుల్ బెడ్ రూం ఇల్లు తదితర జాతీయ రహదారి పొడవునా పగలు, రాత్రి అని తేడా లేకుండా పార్కింగ్ చేస్తున్నారు. తాండూర్, బెల్లంపల్లి నుంచి వంద పడకల దవాఖాన, గాంధీనగర్‌కు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు రెండు కిలోమీటర్ల నుంచి యూటర్న్ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఇదే దారిలో రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే దారిపై భారీ వాహనాలు పార్కింగ్ చేసి ఉంచడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చి.. ప్రయాణికుల తిప్పలు తీర్చి..

ముత్తంపేట వాగు వద్ద గుంతలను పూడ్చుతున్న స్థానికులు

కౌటాల, సెప్టెంబర్ 29 : మండలంలోని ముత్తంపేట ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడడంతో ఆదివారం ముత్తంపేట గ్రామ పెద్ద గుజ్జ రమేశ్ గ్రామస్తులతో కలిసి గుంతలలో కంకర, వైట్ మిక్స్ వేసి పూడ్చివేశారు. నిత్యం ఈ రోడ్డులో వందల వాహనాలు వెళ్తున్నాయని, వాగు వద్ద పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాని కోసమే గుంతలను పూడ్చుతున్నట్లు వారు తెలిపారు. ప్రతి రోజూ ఈ రోడ్డుపై అన్ని శాఖల అధికారులు పలుమార్లు తిరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, గ్రామస్తులు చేసిన కృషిని ప్రయాణికులు అభినందించారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి

వాంకిడి, సెప్టెంబర్ 29 : వాంకిడి మండలంలో సవాతి, దాబా గ్రామ పంచాయతీల మధ్య దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తెలిపారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో వరద నీటి కారణంగా పైప్‌లైన్ దెబ్బతిని సంబంధిత గ్రామాలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తగా ఆసిఫాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ మండల పంచాయతీ అధికారులతో కలిసి ఈ నెల 2వ తేదీ శుక్రవారం సమస్యను పరిశీలిస్తామని గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న భగీరథ పైప్ లైన్ సిబ్బంది

అక్రమంగా పశువుల రవాణా చేస్తే కఠిన చర్యలు

పెంచికల్ పేట్, సెప్టెంబర్ 29 : పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొమురయ్య అన్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్కపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అక్రమంగా నాలుగు బొలేరో పశువులను తరలిస్తుంటే పట్టుకున్నారు. ఎస్ఐ కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాలోని చిల్వాకోడూరు, గొల్లపల్లి మండలాలకు చెందిన వ్యక్తులు ఎండీ రియాజ్, షేక్ జుబేర్, నక్క తిరుపతి, షేక్ సోహీద్, షేక్ సుజొద్దీన్, షేక్ సాహీద్, షేక్ ఇర్ఫాన్ కౌటాల వారసంత, బెజ్జూరు మండలంలోని సలుగు పల్లి, మర్తేడి గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన 36 పశువులను 4 బొలేరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తుంటే పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని పెద్దపల్లిలోని రాజారాం పల్లి ఎడ్ల అంగడిలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పట్టుబడిన పశువులను కాగజ్‌నగర్ గోశాలకు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా పశువులు రవాణా చేస్తే సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జూమ్ మీటింగ్

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 29: రాష్ట్ర సీనియర్ సిటిజన్ సంఘం ప్రతినిధులతో రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహరావు జూమ్ మీటింగ్ నిర్వహించినట్లు సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వయోధికుల పోషణ, సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయడం, మున్సిపాలిటీల్లో డే కేర్ సెంటర్లు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఆఫీసు ఏర్పాటు చేయడం తదితర విషయాలపై చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధి ప్రణాళికపై సూచనలివ్వాలి

- కుమ్రం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న పెందోర్ రాజేశ్వర్

కెరమెరి, సెప్టెంబర్ 29: ఆదివాసీల సమగ్రాభివృద్ధి కోసం అక్టోబర్ 1న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని కుమ్రం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భీం 84వ వర్ధంతి సందర్భంగా రాజకీయ పార్టీలకు అతీతంగా రూపొందించే ప్రణాళికపై ప్రతి ఒక్కరూ సలహా సూచనలు ఇవ్వాలన్నారు. ఆదివాసీ భవన్ లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ఆయా సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, పటేల్ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం


సన్మానించిన వృద్ధులతో చర్చి పాస్టర్ రెవ.జాషువా

మందమర్రి రూరల్,సెప్టెంబర్ 29: రామకృష్ణాపూర్ పట్టణంలో సీఎస్ఐ సెంట్ పీటర్స్ చర్చి ఆధ్వర్యంలో ముందస్తుగా ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 60 ఏళ్లు వయస్సు దాటిన వృద్ధులను చర్చి సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవ ఏం జాషువా మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మెదక్ డయసిస్ ప్రొఫెషనల్ బోర్డు కన్వీనర్, చర్చి సెక్రటరీ డోలకల డెవిడ్ మాట్లాడుతూ వృద్ధుల అనుభవాలు నేటి యువతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టువర్డ్ దేవానంద్, ట్రెజరర్ శరత్ బాబు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

రుద్రాపూర్ రైతు వేదికకు తాళం వేస్తున్న దుర్గం వెంకటి

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 29 : 'రైతు వేదిక నిర్మాణానికి సర్వే నంబర్ 97/175/1/1/4లోని 10 గుంటల భూమి దానంగా ఇచ్చిన. శిలాఫలకంపై అమ్మానాన్న పేర్లు పెడుతామన్నరు. అట్లనే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పిన్రు. రైతు వేదికలో అటెండర్‌గా పనిచేస్తున్న. నాలుగేళ్లుగా జీతం ఇస్తలేరు' అంటూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన దుర్గం వెంకటి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఆదివారం రుద్రాపూర్ లోని రైతు వేదికకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానన్నారు. గ్రామస్తులు ఆయనకు మద్దతు పలికారు.

గ్రామాల్లో దసరా సందడి

- లక్కీడ్రాల నిర్వహణ
- వెరైటీ బహుమతులు
- మేక, కోడి పుంజు, మందు బాటిల్స్‌తో బంపర్ ఆఫర్



దుబ్బగూడెం వారి దసరా ధమాకా కూపన్‌లో ప్రకటించిన బహుమతులు

కాసిపేట, సెప్టెంబర్ 29 : గ్రామాల్లో దసరా సందడి మొదలైంది. పలు గ్రామాల్లో దసరా లక్కీ డ్రాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కాసిపేట మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో లక్కీ డ్రాలో ప్రకటించిన బహుమతులు వెరైటీగా ఉండడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రూ.100తో ఒక కూపన్ తీసుకుంటే మొదటి బహుమతి మేక, రెండో బహుమతి రెండు కిలోల కోడి పుంజు, మూడో బహుమతి రాయల్ చాలెంజ్ ఫుల్ బాటిల్, నాలుగో బహుమతి రాయల్ స్టాగ్ ఆఫ్ బాటిల్‌ను లక్కీ డ్రాలో పెట్టారు. 150 కూపన్లు మాత్రమే పెట్టారు. అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు డ్రా తీస్తామని, డబ్బు కోసం కాదని, బహుమతుల ఖర్చుల మేరకే 150 కూపన్లు మాత్రమే పెట్టామని నిర్వాహకులు రాయలింగు తెలిపారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ఫ్రెండ్లీ పోలీసింగ్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న ప్రెస్ అండ్ పోలీస్ జట్లు

కౌటాల, సెప్టెంబర్ 29 : 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ క్రికెట్ మ్యాచ్‌ను కౌటాల సీఐ ముత్తె రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌటాల ప్రెస్, పోలీసులు ఈ క్రికెట్ పోటీలో తలపడగా పోలీస్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా సీఐ రమేశ్ మాట్లాడుతూ 'పోలీసులు మీ కోసం'లో భాగంగా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు, నిషేధిత ఆన్‌లైన్ గేమ్‌లు, జూదం, బెట్టింగ్, గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయం, సైబర్ నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మున్ముందు మరిన్ని ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో కౌటాల, బెజ్జూర్ ఎస్ఐలు ఎన్ మధుకర్, విక్రమ్, కౌటాల మండల పత్రిక విలేకరులు పాల్గొన్నారు.

జూనియర్ బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

బెస్ట్ అవార్డు అందుకుంటున్న దామెర ప్రేమ్‌దీప్

రెబ్బెన, సెప్టెంబర్ 29: హర్యానా రాష్ట్రంలోని రోహతక్ జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగిన 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు మూడో స్థానంలో నిలిచిందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. నారాయణరెడ్డి తెలిపారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన క్రీడాకారుడు దామెర ప్రేమ్‌దీప్ చాంపియన్‌షిప్ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచడంతో ఇండియన్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ బెస్ట్ టాప్-5 ప్లేయర్స్ విభాగంలో ఎంపిక చేసి బెస్ట్ అవార్డు అందించి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. బెస్ట్ అవార్డు సాధించిన ప్రేమ్‌దీప్‌ను ఏరియా జీఎం శ్రీనివాస్, తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి, కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు సంతోష్, రవితేజ, పీఈటీ భాస్కర్, సీనియర్ క్రీడాకారులు హరిలాల్, శంకర్, గుజ్జ మల్లేశ్, కుమ్మరి మల్లేశ్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణరెడ్డి, కుందారపు నరేశ్, మారిన చందర్ అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 29: బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తాజా మాజీ ఎంపీపీ, బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల మల్లికార్జున్ అన్నారు. ఆదివారం బాలిక కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెంటయ్య, గాజుల ప్రసాద్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్ సుబ్బారావు, మురళి, వినోద్, శ్రీనివాస్, లింగమూర్తి ఉన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగే ఉపేందర్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 29: ఎన్ హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎం లను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆసిఫాబాద్ పాఠశాలలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన రెండవ ఏఎన్ఎం యూనియన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో రెండవ ఏఎన్ఎం అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికీ 9 నెలలైనా చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, రెండవ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, కోశాధికారి సునీత, నాయకురాలు వసంత, గోదావరి, శైలజ, లక్ష్మి, లలిత, భాగ్య, స్వరూప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 29: ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోట అని వక్తలు అభవర్ణించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆదివారం ఆయనకు నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఆయన జేఎన్‌యు యూనివర్సిటీ సమస్యలపై, ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థుల హక్కులపై పోరాటం చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, వివిధ సంఘాల నాయకులు మేడి చరణ్‌దాస్, శాంతికుమారి, మధుకర్, కేశవ్, శ్యాంసుందర్, రాజ్‌కమాలాకర్, మహిపాల్, రమేశ్, ముజములొద్దీన్, జయదేవ్, ఓదెలు, నర్సయ్య, కోట శ్రీనివాస్, సుభాష్, రాంచందర్, కోట శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.